# కానుక

**ఆ**ఫీసు నుంచి అప్పుడే వచ్చిన శరత్‌కి చల్లటి మంచినీళ్ళు గ్లాసుతో తెచ్చి ఇచ్చింది సీత. రెండు క్షణాలు భార్యని తదేకంగా చూశాడు. నాలుగువేళ్ళ వెడల్పున చారల బోర్డరుతో, సన్నసన్నటి గళ్ళున్న నీలిరంగు కాటన్‌చీరా, అంచున్న జాకెట్టూ, కళ్ళకి నిండుగా కాటుకా, నుదుట చిన్న కుంకుమబొట్టూ, మెడలో పగడాలదండా, జడలో మల్లెపూలూ...

ఆ రోజు సీత అలంకరణ అతనికి కొత్తగా అనిపించింది.

"ఏమిటలా చూస్తున్నారు?" చిరునవ్వుతో అడిగింది సీత.

చూపుడువేలితో సీత పెదవులపై రాస్తూ సరదాగా అన్నాడు.

"పెదవులపై చిరునవ్వుల పువ్వులు,

కురులలో సిరిమల్లెల చిరునవ్వులు"

సీత ఫక్కున నవ్వింది. "పెదవులపై పువ్వులేమిటీ... జడలో నవ్వులేమిటీ...! తారుమారుగా" అంటూ మళ్ళీ నవ్వింది.

శరత్ కూడా నవ్వుతూ "నేనేదో ఆశువుగా భలే చెప్పానే అని మురిసిపోయా! అయితే బాగా లేదన్నమాట!" అన్నాడు. "ఈరోజు నిన్ను చూస్తోంటే, నండూరి వారి ఎంకి గుర్తుకొస్తోంది!"

సీత ఒక క్షణం అతనివేపు అదోలా చూసింది. పెదవులపై చిరునవ్వు ఎగిరిపోయింది. "ఏంకి మీకెలా తెలుసు!?" అనడిగింది. "అదేమిటలా అడుగుతున్నావ్! నాకనే ఏముందీ, చాలామందికి తెలుసు!" అన్నాడు భుజాలెగురవేస్తూ.

సీత అతనివేపు చురచురా చూసింది. "చాలామందికి తెలుసా... దాని అందచందాలకి అంత పేరొచ్చేసిందా? కొంచెం ఎర్రగా, బుర్రగా ఉంటుందంతేగానీ, నా మొహంలో ఉన్న కళ దానికి

లేనేలేదనీ, నేనే అందంగా ఉంటానని మా ఊళ్ళో అందరూ అంటారు! వాళ్ళ అమ్మమ్మ మాత్రం తన మనవరాలి అందచందాల గురించి విని ఎక్కడెక్కడి నుంచో సంబంధాలు వస్తున్నాయని గొప్పలు చెప్పుకుంటుంది అందరితో. పెళ్ళిచూపుల వరకూ వచ్చిన రెండు సంబంధాలూ ఎందుకు కుదరలేదో మాత్రం ఎవరికీ చెప్పదు. వినే వాళ్ళున్నారు కదాని బడాయిలు చెప్పుకోవటమేగానీ..."

"ఎవరి గురించి మాట్లాడుతున్నావు?" సీతమాటలకి అడ్డంపడి అడిగాడు ఆశ్చర్యంగా చూస్తూ.

"ఎవరి గురించేమిటీ... మావూరి ప్రెసిడెంటుగారు నండూరి రామబ్రహ్మంగారి మనవరాలు ఎంకి గురించే. వాళ్ళ అమ్మమ్మ పేరు వెంకమ్మ. అదే పెట్టారు గానీ ఈమధ్య వెంకటలక్ష్మి అని మార్చారు. మా అందరికీ మొదటి నుంచీ అలవాటుగదా అందుకని ఇప్పటికీ ఎంకి అనే పిలుస్తాం. ఈ ఊరు నుంచి ఒక సంబంధం వచ్చిందిగానీ కుదరలేదని చెప్పుకున్నారప్పుడు. అయితే అప్పుడు ఎంకిని చూసి వెళ్ళింది మీరు కాదు గదా...!" కళ్ళు పెద్దవిచేసి చూస్తూ అడిగింది.

శరత్‌కి బాగా నవ్వొచ్చింది. సీత తలపై చిన్నగా మొట్టి "మొత్తానికి భలే గొప్పదానివిలే! ఆ ఎంకి ఎవరో నాకు తెలియదుగానీ రేపు ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు నండూరి సుబ్బారావుగారు రాసిన ఎంకిపాటల పుస్తకం తెస్తాను. చదివితే ఎవరో నీకు తెలుస్తుంది" అన్నాడు నవ్వుతూ.

నిజమేనా అన్నట్లుగా అతనివేపు ఒక క్షణం అనుమానంగా చూసింది. ఆ తరవాత మూతి తిప్పుతూ "ఎవరో తెలిసిన వాళ్ళ గురించి చెబుతున్నట్లుగా పుస్తకాల్లోని మనుషుల గురించి మాట్లాడతారని నాకేం తెలుసూ...!" అంది.

వెంటనే ఏదో గుర్తుకు వచ్చినట్లుగా హుషారుగా అతనిచేయి పట్టుకుని "ఈ రోజు ఏంచేశానో తెలుసా? మీ ఆఫీసు గదిలోని తుక్కు అంతా తీసేసి, నీట్‌గా, అందంగా సర్దాను. ఇలా రోజుకో గది చొప్పున సర్దేస్తే, ఇల్లంతా రెండు మూడురోజుల్లో పూర్తయి పోతుంది! రండి, అక్కడే కూర్చుని టిఫిన్ తిందురుగానీ..." అంటూ వరండా పక్కగా ఉండే ఆఫీసుగదిలోకి దారితీసింది.

"అమ్మ సర్టిఫికేట్ ఇచ్చిందని ఇక తెగరెచ్చిపోతున్నట్లున్నావ్‌గా" అని సీత వెనుకే శరత్ వెళ్ళాడు.

శరత్‌కి ఉద్యోగం వచ్చిన నెలలోనే సీతతో పెళ్ళయింది. సీత వాళ్ళది రాజమండ్రి అయినా సీత మాత్రం చిన్నప్పటి నుంచీ పల్లెలో ఒంటరిగా ఉంటున్న అమ్మమ్మ దగ్గరే పెరిగింది. సెవెన్త్‌క్లాసు చదువుతున్నప్పుడు సీతకి సుస్తీచేసి రెండు నెలలు స్కూలుకి వెళ్ళలేదు. పిల్ల బలహీనంగా ఉందంటూ అమ్మమ్మ ఆ సంవత్సరం స్కూలుకి పంపించలేదు. ఇక ఆ తరవాత కూడా ఆవిడ, ఇంట్లోనే చదువుకుంటుందిలే అంటూ స్కూలుకి పంపించలేదు. సీత కూడా చదువుకోవాలనే ఆసక్తి చూపించకపోయేసరికి ఇంట్లోవాళ్ళు కూడా ఇక ఊరుకున్నారు.

పెళ్ళిచూపులప్పుడు 'ఈ రోజుల్లో అందరూ డిగ్రీ వరకూ అయినా చదువుతున్నారు. అమ్మాయి టెన్త్ వరకూ అయినా చదవలేదు. అదొక్కటే లోపం. మిగతా అన్ని విషయాలూ బాగున్నాయి. మరి నువ్వేమంటావు?' అని తల్లి అడిగినప్పుడు శరత్ వెంటనే తన అంగీకారం తెలిపాడు. సీత అందం అతన్ని అంతగా ఆకట్టుకుంది మరి!

సీత పెళ్ళయిన వెంటనే కాపురానికి వచ్చేసింది. సంవత్సరం పూర్తవక ముందే శరత్ ప్రయత్నం ఫలించి సొంతవూరికే ట్రాన్స్‌ఫర్ అయింది. శరత్ తండ్రి అప్పటికి చనిపోయి నాలుగేళ్ళయింది.

ఒంటరిగా ఉంటున్న తల్లికి తోడుగా సొంత ఊళ్ళో సొంత ఇంట్లో ఉండే అవకాశం కలిగినందుకు శరత్‌కి బాగా ఆనందం కలిగింది. ఒక నెల క్రితమే అక్కడికి వచ్చారు.

నాలుగు రోజుల క్రితం సీత వంటగది అంతా నీట్‌గా సర్దింది. ఖాళీసీసాలూ, మూతలు పగిలిన ప్లాస్టిక్ డబ్బాలు లాంటి వాటన్నింటినీ రెండు బుట్టలనిండా నింపి అవతల పారేసింది. దేనికైనా పనికివస్తాయంటూ అత్తగారు గునుస్తున్నా వినిపించుకోలేదు.

ఇక తరువాత నీట్‌గా పేపర్లు వేసి ముఖ్యమైన సామాన్లను వరసవారీగా, చేతికి అందుబాటుగా సర్దింది. అప్పుడు అత్తగారు కొడుకు ఎదురుగా సీతని "అమ్మమ్మ దగ్గిర బాగా ట్రైనింగు అయినట్లుంది. గది అందంగా, నీట్‌గా సర్దింది. కోడలి చేతిలో మంచి నేర్పే ఉంది" అంటూ మెచ్చుకుంది.

ఆ తరవాత రెండు రోజులకే ఆవిడ కూతురు దగ్గరకు వెళ్లింది. కూతురు ఉషకి అప్పటికి రెండుసార్లు అబార్షన్లు అయ్యాయి. మూడోసారి ప్రెగ్నెన్సీ వచ్చింది. బెడ్‌రెస్ట్ అవసరమనీ, ఎవరైనా దగ్గరుండి జాగ్రత్తగా చూసుకోవాలని డాక్టరు చెప్పిందని అల్లుడు ఫోను చేయగానే ఆవిడ ఇంటిని సీతకి అప్పజెప్పి, జాగ్రత్తలూ చెప్పి కొన్నాళ్ళు ఇక అక్కడే ఉండటానికి వెళ్ళిపోయింది.

సీతకి అప్పటికి అయిదవ నెలవచ్చింది. ఏ సమస్యలూ లేకుండా ఆరోగ్యంగానే ఉంది. అన్ని పనులూ స్వయంగా చేసుకుంటోంది. అయినా అత్తగారు లేకుండా ఒంటరిగా ఉండటంతో కాలక్షేపం కానట్లుగా అనిపించటంతో ఇల్లంతా తన అభిరుచి ప్రకారం సర్దే పని మొదలు పెట్టింది.

* * *

శరత్ ఆఫీసుగదిని నాలుగువేపులా చూశాడు. ఒకమూల టీపాయ్ వేసి దానిపై పూలు సర్దిన ఫ్లవర్‌వాజ్‌ని పెట్టింది. సోఫానీ, టేబుల్ కుర్చీలనూ అటూ ఇటూ మార్చింది. "ఇలా చిన్న చిన్న మార్పులు చేయటం వలన గది విశాలంగా, అందంగా ఉంది కదూ?" సీత ప్రశ్నకి శరత్ అవునన్నట్లుగా తలఊపి "అందం సంగతి సరే, టేబుల్, కుర్చీ కిటికీకి దగ్గరగా ఉంటేనే గాలి బాగా వస్తుందిగా" అన్నాడు.

"ఇక్కడికీ బాగానే వస్తుందిలెండి" అంటూ ఒక వారగా ఉన్న అద్దాల బీరువాల దగ్గరకు వెళ్ళింది. "మీకోసం వచ్చినవాళ్ళు ఈ గదిలోనే కూర్చుంటారుగా... అందుకే గది అందంగా ఉంటుందని ఈ బీరువాలో బొమ్మలన్నీ సర్దాను. ఈ పూసల బొమ్మలన్నీ నేను తయారు చేశాను తెలుసా? మా ఊళ్ళో సుబ్బాయమ్మగారి కోడలు చేస్తోంటే చూసి నేనూ తయారు చేశాను. ప్రత్యేకంగా నేర్చుకోకుండా చూసే తయారు చేశానని తెలివైనదానివి, చక్కగా తయారు చేశావంటూ సుబ్బాయమ్మగారు నన్ను భలే మెచ్చుకున్నారు తెలుసా...!

ఈ రెండో బీరువాలో గాజుగ్లాసులూ, ప్లేటులూ పెట్టుకుంటే బావుంటుంది. డైనింగు టేబుల్ దగ్గరకు జరపటం నా ఒక్కదానివల్లాకాక, మీరొచ్చాక సాయంపట్టి జరుపుదామని ఊరుకున్నాను..."

సీత అలా చెప్పుకుపోతోంటే శరత్ అడ్డం వచ్చాడు – "బొమ్మలూ,గాజుసామాన్లు పెట్టుకోవటానికి వేరే చేయించుకోవచ్చుగానీ, ఇవి పుస్తకాలకోసం చేయించిన బీరువాలు. వీటిలోని పుస్తకాలన్నీ ఎక్కడపెట్టావ్?" అన్నాడు అసహనంగా అటూఇటూ చూస్తూ.

"తీసేశాను. ఎప్పటికప్పుడు అనవసరమైనవన్నీ తీసేస్తూ ఉండకపోతే చెదలు చేరతాయి."
"తీసేశావా...? అంటే... ఏం చేశావ్?" ఆదుర్దాగా అడిగాడు.

"న్యూస్‌పేపర్లు కొనేవాడికి పేపర్లతో పాటుగా ఇచ్చేశాను. ఉండండి. మీకు టిఫిన్ తెస్తాను" అంటూ లోపలకు వెళ్ళింది.

శరత్ నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

టిఫిన్ ప్లేటుతో తిరిగి వచ్చిన సీతతో "వేళాకోళమా... నిజమే చెబుతున్నావా?" అన్నాడు.

"ఇందులో వేళాకోళం ఏం ఉందీ...! పేపర్లవాడికి ఇచ్చేశాను.. ఏవో నిధులూ... నిక్షేపాలూ నేనెవరికో ధారపోసేసినట్లుగా అంత కంగారుపడిపోతున్నారేంటీ...! అవన్నీ పాతపుస్తకాలేగా! కొన్ని పుస్తకాలకి అట్టలు కూడా ఊడిపోతుంటేనూ...!" అతనివేపు ఆశ్చర్యంగా చూస్తూ అంది.

"తీసుకోండి" అంటూ అందివ్వబోయిన టిఫిన్ ప్లేటును కోపంగా ఎగరగొట్టేశాడు. పకోడీలన్నీ గదంతా చెల్లాచెదురై ప్లేటు పెద్ద శబ్దంతో క్రింద పడింది.

శరత్ ఆగ్రహావేశాలతో ఊగిపోయాడు. "ఆ పుస్తకాలన్నీ తూ...కా...ని...కి అమ్మేశావా? నీ తలలో ఉన్నది మెదడా... మన్నా...? అట్టలు కొంచెం వదులైన పుస్తకాలను ఈవేళో, రేపో బైండింగ్‌కి ఇవ్వాలని అనుకుంటుంటే, నువ్వు అసలుకే ఎసరు పెట్టేశావన్న మాట! ఇంట్లో ఎలుకలున్నాయని ఇంటికి నిప్పుపెట్టేరకం తెలివితేటలు నీవని ఇప్పటి వరకూ తెలుసుకోలేకపోయాను! వీక్లీ, పేపర్లు అమ్మేసినట్లుగా అంతంత ఖరీదైన, విలువైన పుస్తకాలను తూకానికి ఎవరైనా అమ్ముతారా...?! మనకు అవసరం లేకపోతే కావలసినవాళ్ళకి ఎవరికైనా ఇవ్వాలి. లేకపోతే ఏ లైబ్రరీకయినా ఇవ్వాలి. అంతేకానీ పదిరూపాయలకో, పాతికరూపాలకో ఖరీదైన పుస్తకాల్ని అమ్మేస్తావా...! కిందపడిన కాగితాన్నయినా సరే, పనికివచ్చేదేమోనని అమ్మ నాకు చూపించిగానీ అవతల పడెయ్యదు. నీకేమో, ఆ పుస్తకాలన్నింటినీ తీసేసే ముందు నన్ను ఒకమాట అడగాలనే కనీస ఇంగిత జ్ఞానం కూడా లేకుండా పోయింది!"

సీతకి దగ్గరగా వచ్చి రెండు భుజాలనూ గట్టిగా పట్టుకుని ఆవేశంగా అన్నాడు "పుస్తకాలంటే ఏమిటో నీకు తెలుసా...! అవి వెలుగుబాటలూ... పూలతోటలూ!! ఒక గొప్ప గ్రంథం మనకొక గమ్యాన్నీ, లక్ష్యాన్నీ చూపించగలిగితే, మరొక మంచి నవల మధురానుభూతిని కలిగిస్తుంది!

మనకు ఏకాంతంలో తోడుగా నిలిచేది మంచి పుస్తకమే! పుస్తకాన్ని ఆరిపోని అక్షర నీరాజనమన్నారు! విజ్ఞాన దీపాన్ని వెలిగించటమే కాదు, వినోదాన్నీ అందిస్తుంది.

పనికిరావని నువ్వు తీసేసిన ఆ పుస్తకాలలో ఏమున్నాయో తెలుసా? ఎందరో గొప్ప వ్యక్తుల జీవితచరిత్రలున్నాయి. మళ్ళీ మళ్ళీ చదవాలనిపించే మంచి నవలలున్నాయ్! ఆపైన నాకు వాటిలో ఎన్నెన్నో విలువైన, అపురూపమైన జ్ఞాపకాలున్నాయి!

చదువుకునే రోజుల్లో నాకు ఏ సబ్జెక్టులో ఫస్టుమార్కు వచ్చినా నాన్నగారు ఒక మంచి పుస్తకాన్ని మొదటి పేజీలో చక్కని కొటేషను రాసి ప్రెజెంట్ చేసేవారు. ఆ పుస్తకాలన్నిటినీ నేను నిధులూ, నిక్షేపాలుగానే భావించి జాగ్రత్తగా దాచుకున్నాను!"

శరత్ గొంతు బొంగురుపోయింది. "నా ఊహలు ఎక్కడి వరకూ వెళ్లేవో తెలుసా...? మన పిల్లలకి ఆ పుస్తకాల్ని చూపించి, వాళ్ళ తాతగారు నాకు ఏ సందర్భంలో ఎందుకు ఇచ్చారో... ఆ కబుర్లన్నీ వాళ్ళతో కలసి నెమరేసుకోవాలని అనుకునేవాడిని! అంతేకాదు ఒక్కొక్క పుస్తకంగా ఇంకా ఎన్నో పుస్తకాలను కొంటూ, ఒక చిన్న లైబ్రరీని ఏర్పాటు చేసి నా మనవలకి కానుకగా ఇవ్వగలగాలని ఆలోచనలు చేసేవాడిని!

నువ్వు అమ్మమ్మ దగ్గర గారాబంగా పెరిగావని అనుకున్నానేగానీ,మంచీ చెడూ తెలియనంత పల్లెటూరి మొద్దులా... మూర్ఖురాలిగా తయారయ్యావని మాత్రం ఊహించలేకపోయాను...”

సీత అక్కడ ఇక ఒక క్షణం కూడా నిలబడలేనిదానిలా చటుక్కున తలతిప్పుకుని గబగబా వెళ్ళిపోయింది కన్నీళ్ళను తుడుచుకుంటూ.

శరత్ కూడా కణతలు రుద్దుకుంటూ గదిలోకి వెళ్ళి మంచం మీద వాలిపోయాడు. కోపతాపాలతో ఇద్దరూ చెరోచోట ఉండిపోయారు చాలాసేపు. ఆ రాత్రికి కూడా అదే పరిస్థితి కొనసాగేదేమో కానీ కాసేపటిలోనే సీత అన్నయ్య మోహన్ రావటంతో... ఇద్దరూ మామూలుగా కనిపించటానికి ప్రయత్నం చేశారు. బెంగుళూరులో ఇంజనీరింగ్ చదువుతున్న మోహన్ సెలవులకు ఇంటికి వెళ్తూ, దారిలో చెల్లెలు ఇంటిదగ్గర ఒకరోజుండి వెళ్దామని ఆగాడు. ఇద్దరూ మామూలుగా లేరని గ్రహించాడు కానీ కారణం అడగలేక ఊరుకున్నాడు.

ఆ మరునాడు శరత్ ఆఫీసునుంచి వచ్చేసరికి మోహన్‌తోపాటూ ఊరికి వెళ్ళటానికి సీత కూడా సూట్‌కేసు సర్దుకుని రెడీగా ఉంది.

“బావా, సీతకి వంట్లో కొంచెం నలతగా ఉందట. అమ్మ దగ్గర పదిరోజులుండి వస్తే బావుంటుందని నాతో తీసుకువెళ్తున్నాను. బావుంటే వచ్చేస్తుంది. లేకపోతే ఎలాగూ రెండునెలల్లో అక్కడికి రావాలిగా, ఇక అక్కడే ఉంటుంది” అని మోహన్ చెప్పినప్పుడు శరత్ ఏం మాట్లాడకుండా తలవూపి ఊరుకున్నాడు. సీత కోపంతోనే వెళ్తోందని అతనికి అర్థమైంది. తప్పు చేయటమే కాకుండా ఎదురు అలక ఏమిటని శరత్‌కీ కోపం వచ్చింది. అందుకే ముభావంగా ఉండిపోయాడు.

* * *

బీరువాలను చూసినపుడల్లా శరత్‌కి మనసులో కలుక్కుమనేది. రోజులు గడిచేకొద్దీ కోపం తగ్గి మామూలయ్యాడు. సీత క్షేమసమాచారం తెలుసుకోవటానికి అప్పుడప్పుడూ ఫోను చేస్తున్నాడు. ఏదో ప్రశ్నలకి సమాధానం చెబుతున్నట్లుగా మాట్లాడుతోంది తప్ప మనఃస్ఫూర్తిగా మాట్లాడటంలేదని పించింది. అందుకే శరత్ తరచూ కాకుండా అప్పుడప్పుడూ చేస్తున్నాడు.

బాబు పుట్టాడని కబురు వచ్చాక, చెల్లెలింటికి వెళ్ళి తల్లిని తీసుకుని రాజమండ్రి వెళ్ళాడు. రెండు రోజులుందామని ఆఫీసుకు సెలవుపెట్టాడు. కానీ సీత అప్పుడు కూడా ముభావంగా ఉండి ముక్తసరిగా మాట్లాడుతున్నట్లు అనిపించటంతో ఆరోజే తిరిగి వచ్చేశాడు.

బాబుకు మూడవ నెల వచ్చాక సీత తండ్రి దగ్గర్నుండి ఫోను వచ్చింది. ఆ మరునాడు మోహన్ సీతనూ, బాబునూ తీసుకుని వస్తున్నాడు కాబట్టి ఇంటి తాళాలు పక్కింట్లో ఇచ్చి వెళ్లమని మావగారు చెప్పారు. ఏ ట్రైనుకి వచ్చేదీ తెలియదు కాబట్టి స్టేషనుకి రానవసరంలేదని ఆయన చెప్పారు. ఆ రోజు సెలవు పెట్టి ఇంట్లోనే ఉందామని శరత్‌కి అనిపించింది. కానీ, ఆ ఉద్దేశం మార్చుకున్నాడు. సీత తనకి ముందుగా చెప్పకుండా రావటం, స్టేషనుకి రానవసరంలేదనటం... అతనికి కోపం కలిగించాయి.

* * *

ఆ మరునాడు సాయంకాలం శరత్ ఇంటికి వచ్చేసరికి సీత ఒక్కతే ఉంది. మోహన్ వెంటనే వెళ్ళిపోవాలనీ, పని ఉందనీ ఆఫీసుకు ఫోనుచేసి శరత్‌కి చెప్పాడు. ఇంటికి రాగానే సీత నవ్వుమొహంతో

ఎదురొచ్చేసరికి శరత్‌కి ప్రాణం లేచి వచ్చినట్లయింది. బాబుని చూడటానికి వెళ్లినప్పుడు సీత నవ్వినాగానీ, ఆ నవ్వు అరువు తెచ్చుకున్నట్లుగా అనిపించిందే తప్ప సహజంగా అనిపించలేదతనికి.

ఇప్పుడు సీత మామూలుగా కనిపించే సరికి అతనికి చాలా ఆనందంగా అనిపించింది. ఉయ్యాలలో నిద్రపోతున్న బాబుని తన్మయత్వంతో చూసుకుంటున్న శరత్ దగ్గరకు వచ్చి అతని చేయి పట్టుకుని "మీకొక కానుక తెచ్చాను. చూద్దురుగాని రండి..." అంది చిరునవ్వుతో.

"నాకా...? కానుకా...?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును మీకే" అంటూ హుషారుగా ఆఫీసుగదిలోకి అతన్ని తీసుకెళ్లింది. రెండు బీరువాల అద్దాల తలుపులూ పూర్తిగా తెరిచి "చూడండి... మీకు టిఫిన్ తెస్తాను" అంటూ వంటగదివేపు వెళ్ళిపోయిది.

బీరువాలలో పుస్తకాలు నీట్‌గా, పొందికగా సర్దిఉన్నాయి. రెండు వరసలలో ఇంగ్లీషు నవలలూ, మిగతావన్నీ తెలుగువి! శరత్‌కి ఆశ్చర్యంతో ఒక క్షణం మతిపోయినట్లయింది!

ఆశ్చర్యం నుండి తేరుకున్న శరత్ ఆ పుస్తకాల పేర్లన్నీ హడావుడిగా చూశాడు. మొదటి పేజీలో తండ్రి చేతిరాతతో ఉన్న తన పాత పుస్తకాలు కూడా కొత్త బైండింగ్‌తో కనిపించడంతో అతని ఆశ్చర్యం ఇంకా రెట్టింపయింది!

"తీసుకోండి" అంటూ సీత అందించిన టిఫిన్ ప్లేటును పక్కనపెట్టేసి "సీతా... ఏమిటిది... కలా, నిజమా... అనిపిస్తోంది! ఇన్ని పుస్తకాలు కొనాలంటే డబ్బు వేలలో కావాలిగా, ఎక్కడిదీ...? నాకు నాన్నగారిచ్చిన పుస్తకాలు కూడా కొన్ని ఉన్నాయిగా...!" అని అడిగాడు ఎంతో ఉద్వేగంతో.

సీత ఒక క్షణం మౌనంగా ఉండిపోయింది. తరవాత మెల్లగా చెప్పుకొచ్చింది.

"పుస్తకాలను అమ్మేసినందుకు మీరు కోప్పడినందుకు నాకు బాధేసింది. కోపం వచ్చింది. ఆలోచిస్తే... తెలివి తక్కువ పని చేశానని నాకూ అనిపించింది. ఇంటికి వెళ్లాక అన్నయ్యకి చెబితే వాడూ బాగా తిట్టాడు. అప్పుడే నా తప్పును ఎలాగైనా సరిద్దుకోవాలని గట్టిగా నిర్ణయించుకున్నాను.

మన పక్కింట్లో పనిచేసే నరసమ్మకి పేపర్లుకొనే అతను బంధువని నాకు తెలుసు. ఈ విషయం అన్నయ్యకు చెప్పాను. అన్నయ్య మళ్ళీ ఇక్కడకు వచ్చి అతనిల్లు కనుక్కుని ఆ పుస్తకాల్ని సంపాదించటానికి ప్రయత్నం చేశాడు కానీ దొరకలేదు. అదృష్టంకొద్దీ మీ నాన్నగారిచ్చినవి కొన్ని దొరికాయి.

అమ్మకు నేను చెప్పాను. పిల్లాడో, పిల్లో పుట్టాక ఫంక్షన్ చేయటం, బంగారు నగలు ఏమైనా చేయించటం, అత్తవారింటికి వెళ్లేటప్పుడు సారె... ఇలాంటివేవీ అవసరం లేదు. ఆ డబ్బు నాకే ఇచ్చెయ్యమని అడిగాను. పెళ్ళిలో నాకు బాబాయ్‌లు, బంధువులు ఇచ్చిన డబ్బుతో మన ఇంటికి కావలసిన ఫర్నీచర్ ఏమైనా చేయించాలని, ఆ డబ్బును నాన్న బ్యాంకులో వేశారు. అదీ నాకు ఇచ్చెయ్యమని అడిగాను. అనవసర ఖర్చు ఏమీ చేయను. మా ఆయననకు నచ్చే విధంగానే చేస్తానని చెప్పాను. అయినా అమ్మ మొదట ఒప్పుకోలేదు. కానీ అన్నయ్య అమ్మకు ఏంచెప్పాడో, ఎలా చెప్పాడో కానీ చివరకు ఒప్పించాడు.

ఆ తరవాత... నాన్న ఫ్రెండు వెంకటేశ్వరరావుగారు పత్రికల్లో అప్పుడప్పుడూ వ్యాసాలు రాస్తుంటారు. ఆయన ద్వారా అన్నయ్య నిన్నటి, ఈ తరం ప్రసిద్ధ రచయితల చదవదగ్గ పుస్తకాల లిస్టు తయారు చేశాడు. ఇక వాటిలో దొరికినవన్నీ కొన్నాం. కొన్నిటిని ఆర్డరు చేసి తెప్పించాం..."

సీత చెబుతోంటే శరత్ సంభ్రమాశ్చర్యాలతో మాటలు రానివాడిలా ఉండిపోయాడు. ఒక క్షణం తరవాత ఏం మాట్లాడాలో తోచనట్లుగా “సీతా... సీతా...” అన్నాడు.

సీత అతనివేపు సూటిగా చూస్తూ అడిగింది ”మీరన్నట్లుగా పుస్తకాలంటే వెలుగుబాటలూ, పూలతోటలూ కావచ్చు! మన మెదడుకు పదును పెట్టి విజ్ఞానాన్ని కలిగించేవీ, వినోదాన్ని అందించేవీ కావచ్చు. పుస్తకాలు జీవితంలో విలువైన, ముఖ్యమైన భాగం మాత్రమే కదా! కానీ... నేను... మీతో జీవితం పంచుకోవటానికి వచ్చినదాన్ని. అమాయకత్వంతో చేసిన తప్పుకు... మనసు గాయపడేంతగా అలా మాట్లాడతారా...?!” సీత కనుకొలకుల్లో నీళ్ళు నిలిచాయ్.

సీత పుస్తకాలు అమ్మేసిందని తెలిసినప్పుడు ఎంతటి ఆగ్రహావేశాలతో రగిలిపోయాడో... శరత్ ఇప్పుడు అంతకు రెట్టింపుగా పశ్చాత్తాపంతో, తప్పుగా మాట్లాడాననే భావంతో కదిలిపోయాడు! మందలింపుగా మాట్లాడితే సరిపోయేది. అమాయకత్వంతో చేసిన తప్పే కానీ అహంకారంతో చేసినది కాదుగా అనుకున్నాడు.

తన మనసులోని భావాన్ని మాటల్లో చెప్పడం రానట్లుగా, క్షమాపణ కోరుతున్న వాడిలా సీత రెండు అరచేతులనూ చేతుల్లోకి తీసుకుని ఎంతో ఆర్తిగా, ప్రేమగా చుంబించాడు!

ఇద్దరూ రెండు క్షణాలు మౌనంగా ఉండిపోయారు. సీత అతని భుజం మీద తలవాల్చి మళ్ళీ అంది – “నిజానికి మీకు నేనిచ్చిన కానుక అనకూడదేమో... చేసిన తప్పును సరిదిద్దుకోవటమే అవుతుంది! ఇప్పుడు ఆలోచిస్తోంటే... మళ్ళీ అనిపిస్తోంది మీరు అలా పరుషంగా మాట్లాడటం వలన మంచే జరిగిందని! అందుకే కదా, చేసిన పొరపాటును సరిదిద్దుకోవాలనే పౌరుషం కలిగింది. అప్పటి వరకూ ప్రశాంతంగా ఉండలేననీ, మీ ఎదుట సగర్వంగా నిలబడలేననీ అనిపించింది! అందుకే... మీతో ఫోన్‌లోనూ, మీరు వచ్చినప్పుడూ మామూలుగా మాట్లాడలేకపోయాను...

పుస్తకాలను ఎలాగూ కొంటున్నాను కదా అని చదవటం మొదలుపెట్టాను. ఇంగ్లీషు నవలల్ని మాత్రం ఇక్కడికి వచ్చాక మీ దగ్గర బాగా నేర్చుకుని మీతో కలిసి చదువుదామని ఊరుకున్నాను కానీ, ఇంచుమించుగా తెలుగువన్నీ చదివాను. ఇంటిదగ్గరున్న ఈ ఏడెనిమిది నెలలూ బాగా సద్వినియోగమయ్యాయి. బాబు పుట్టకముందయితే రోజులో మూడొంతుల కాలం పుస్తకాలు చదువుతూనే గడిపాను. అప్పుడే నేనొక నిర్ణయం తీసుకున్నాను... మీరు మీ మనవలకి ఇవ్వాలనుకున్న కానుకకు నేనూ సహకరించాలని! ఇంటి ఖర్చులకి మీరిచ్చే డబ్బు నుండి ఇక ప్రతి నెలా ఒకటి రెండు పుస్తకాలను కొంటుంటాను.

పుస్తకాలను చదవటం వల్లే నా ఆలోచనా పరిధి పెరిగినట్లూ.... ఒక కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినట్లూ అనిపించింది. ఇలా నా అభిప్రాయాల్నీ, ఆలోచనల్నీ సరిగా చెప్పగలిగే భాష కూడా అలవడిందిగా...!” సీత చిరునవ్వు నవ్వింది.

“నా అభిప్రాయాల్ని... అభిరుచుల్నీ ఇంతగా గౌరవించే భార్య లభించటం నిజంగా నా అదృష్టం. నాకు భగవంతుడిచ్చిన అపురూపమైన కానుకవి నువ్వు...!” అన్నాడు శరత్ ఆనందపారవశ్యంతో.

ఈనాడు ఆదివారం. 30, జూన్, 2002.